

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 24-05-2026 | సంపుటి - 27 | సంచిక -362 | రూ : 4 | పేజీలు: 8


## వేద పాఠశాలకు శ్రీకారం

- యాదగిరిగుట్టలో భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రూ.99.55 కోట్ల అభివృద్ధి పనులకూ.. ఆలయంలో సమస్యల పరిష్కారానికి హామీ

2లో



## 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..
## పాలమూరుకు రూ.587 కోట్లు



- రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు
- జూన్ 1న నియోజకవర్గానికి 2 వేల చొప్పన రెండో విడత ఇళ్ల మంజూరు
- క్యూర్ పరిధిలో పేదలకు లక్ష గృహాలు
- వేగంగా పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ
- గోదావరి పుష్కరాలకు రూ.వేయి కోట్లు
- జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం
- విద్యుత్ ఆర్డీఎస్ఎస్ పథకం అమలు
- మంత్రి పొంగులేటి వెల్లడి

2లో

## వైకాపా గొడ్డలి పార్టీ..
## సమాజానికి హానికరం

- పార్టీ 'మళ్లీ రావద్దు' అని ప్రజలంతా నినదించాలి
- తల్లికి అన్నం పెట్టని వ్యక్తి పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా?
- జగన్‌ను ఉద్దేశించి సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- చిత్తూరు జిల్లా యాదమరిలో పర్యటన
- ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు చేస్తామని వెల్లడి

2లో





## మళ్లీ..
## పెట్రో మంట

- 8 రోజుల్లో మూడోసారి
- తాజాగా 90పైసలు పెంపు

2లో

## నిర్లక్ష్యపు నిర్ణయం





- గ్రీన్ కార్డుల మెమోను వ్యతిరేకిస్తున్న న్యాయ నిపుణులు
- 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం!

2లో

## మోదీకి అమెరికా ఆహ్వానం
## మార్కో తో కీలక భేటీ

- నాలుగు రోజుల భారత పర్యటనలో రూబియో
- భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ
- యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం

2లో



## శ్వేత సౌధం సమీపంలో
## కాల్పుల కలకలం

- వైట్హౌస్ వద్దకు దూసుకొచ్చి కాల్పులు జరిపిన దుండగుడు
- భద్రతా సిబ్బంది ఎదురుకాల్పుల్లో నిందితుడు మృతి
- భారీగా మోహరించిన భద్రతా బలగాలు, 45 నిమిషాల పాటు లాక్‌డౌన్

2లో







## భవిష్యత్తులో యుద్ధాలు
## ఇలా ఉంటాయి

- భవిష్యత్ యుద్ధాలు బహుముఖంగా ఉంటాయన్న సీడీఎస్
- షిర్డీలో ఎన్ఐబీఈ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ప్రారంభం
- రక్షణ తయారీ, సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా మారనున్న షిర్డీ
- ఏఐ, రోబోటిక్స్, డ్రోన్లదే భవిష్యత్ యుద్ధాల్లో కీలకపాత్ర
- రూ.38,000 కోట్లు దాటిన భారత రక్షణ ఎగుమతులు

2లో

# 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు.. పాలమూరుకు రూ.587 కోట్లు

హైదరాబాద్: తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. పూరిగుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని తీర్మానించింది. జూన్ 1 నుంచి ఇందిరమ్మ పథకం రెండో విడత కింద పేద కుటుంబాలకు 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరుకు అనుమతించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ 2వ తేదీ నాటికి దాదాపు లక్ష గృహ ప్రవేశాలు జరగాలని నిర్ణయించింది. సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించింది. వివరాలను రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి వెల్లడించారు. ''కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ప్రారంభిస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరం అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం. వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించాం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని సూచించింది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు; గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తాం. సొంత స్థలాలున్న వారికి రూ.ఐదేసి లక్షలు ఇస్తాం.

**లైఫ్ సైన్సెస్ విధానానికి ఆమోదం**

తెలంగాణను 2030 నాటికి ఐదు ప్రపంచ శ్రేణి లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 202630ని మంత్రిమండలి ఆమోదించింది. దావోస్‌లో సీఎం ఈ విధానాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తాం. పరిశోధన, అభివృద్ధి యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ విధానంలో మార్పు తెచ్చాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

**ఇతర ముఖ్య నిర్ణయాలు..**

* పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్ల కేటాయింపు.
* ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు.
* వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1,000 కోట్ల కేటాయింపు. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరు.
* రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లు మార్క్‌ఫెడ్‌లో విలీనం. రాష్ట్ర సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థ హాకాలో విలీనం.
* కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 శాశ్వత బోధన, 6 బోధనేతర, 3 పోస్టులు పొరుగు సేవల కేటగిరీలో మంజూరు. కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి 18 పోస్టులు మంజూరు.
* అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా వెల్దిలో 4, రుక్మాపూర్‌లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపు.
* పంట ఉత్పత్తుల కొనుగోలు...: మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు రాష్ట్ర మంత్రి మండలి శనివారం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే 14.89 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతించింది. ఇంకా నిల్వలున్నందున అదనంగా 6,53,817 టన్నుల కొనుగోళ్లకు రూ.1,677 కోట్ల రుణం అవసరమని, దానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని మార్క్‌ఫెడ్ ప్రతిపాదించగా ఆమోదం లభించింది. 2,76,277 టన్నుల జొన్న కొనుగోళ్లకు రూ.1,154.76 కోట్ల రుణం కోసం, 10,175 టన్నుల పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు రూ.86.37 కోట్ల రుణం కోసం ప్రభుత్వ బ్యాంకు గ్యారంటీలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది'' అని మంత్రి పొంగులేటి వివరించారు.

**ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు...**

విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించాం. ఇది కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదు. గత ప్రభుత్వం 2017 జనవరి 2న అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. దీనిని అమలు చేయలేదు. దీనిపై రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘంగా చర్చించాం. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దీనిపై వివరంగా మాట్లాడారు. విద్యుత్‌రంగానికి పరిశ్రమలు, గృహాలు, రైతులకు మేలు చేసే ఈ పథకంలో ఇప్పటికే అన్ని రాష్ట్రాలు చేరాయి. దీనిని అమలు చేయాలని నిర్ణయించాం.

## శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ వద్దకు దూసుకొచ్చిన ఓ దుండగుడు బలగాలపై కాల్పులకు దిగాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వైట్‌హౌస్ కాంప్లెను లాక్‌డౌన్ చేశారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు ఎదురు కాల్పులు జరపగా నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపారు. దాదాపు 15 నుంచి 30 రౌండ్లు కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. కాల్పుల సమయంలో నిందితుడికి సమీపంలో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. నిందితుడిపై కాల్పుల తర్వాత ఆ ప్రాంతాన్ని భద్రతాబలగాలు పూర్తిగా తనిఖీ చేశాయి. అంతా సద్దుమణగడంతో 45 నిమిషాల తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేశారు. శ్వేతసౌధం సమీపంలో వరుస కాల్పుల శబ్దాలు విన్నట్లు జర్నలిస్టులు తెలిపారు. జర్నలిస్టులు శ్వేతసౌధం నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్న సీక్రెట్ సర్వీసెస్ అధికారులు వారిని ప్రెస్ బ్రీఫింగ్ రూమ్‌లోకి వెళ్లాలని ఆదేశించారు. కాల్పుల సమయంలో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు వైట్‌హౌస్ వద్ద భారీగా మోహరించాయి. శ్వేతసౌధం సమీపంలో 17వ స్ట్రీట్, పెన్సిల్వేనియా ఎవెన్యూ సమీపంలో ఘటన జరిగింది. కాల్పుల ఘటనను ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సీక్రెట్ సర్వీసెస్ అధికారులకు ఈ ఘటనలో ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు.

## వేద పాఠశాలకు శ్రీకారం

భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయనగరిలో 15 ఎకరాల విస్తీర్ణంలో 1.4లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న వేద గురుకుల పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. దీంతోపాటు మొత్తం రూ.99.55 కోట్లతో చేపట్టనున్న ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. తొలుత ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 8.50 గంటలకు ఆలయ నగరి ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్దకు సీఎం చేరుకున్నారు. అక్కడి నుంచి వేద పాఠశాల ప్రాంగణానికి రాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిస్వామి వద్దకు వచ్చి ఆయన పాదుకలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధాన పండితుల మంత్రోచ్చారణల మధ్య వేద పాఠశాల నిర్మాణానికి విజయేంద్ర సరస్వతిస్వామితో కలిసి సీఎం భూమి పూజ చేశారు. ఆలయంలో కల్పించే మౌలిక వసతులకు శిలాఫలకాలు ఆవిష్కరించిన అనంతరం సీఎంతో పాటు మిగిలిన వారికి సైతం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం అక్కడి నుంచి కాన్వాయ్‌లో దేవస్థానానికి వెళ్లి పంచనారసింహులను దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో 35 నిమిషాలు ఉన్న సీఎం అనంతరం 11.05లకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు.

**తితిదే తరహాలో అభివృద్ధి**

యాదగిరిగుట్ట ఆలయనగరిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని అత్యంత భక్తిశ్రద్ధలతో పనులు నిర్వహించేలా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి జిల్లా యంత్రాంగానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆలయంలోని పలు అపరిష్కృత సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు అర్చకులు, అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**ఏమేం పనులు చేయనున్నారంటే..**

రూ.43.79 కోట్ల అంచనా వ్యయంతో మూడు దశల్లో వేద పాఠశాలను నిర్మించనున్నారు. సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 500 మంది విద్యార్థులకు వసతితో కూడిన విద్య అందించనున్నారు. సముదాయంలో హోమాలు, యాగశాలలే కాకుండా గోశాల కూడా ఏర్పాటు చేయనున్నారు. రూ.9.86 కోట్లతో కొండపైన నిత్యకల్యాణ రంగ మండపం, వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో పై కప్పు నిర్మాణం, రూ.1.34 కోట్ల అంచనాతో మాడవీధులకు కొత్త మెట్ల నిర్మాణ పనులు, రూ.43.15 కోట్లతో డార్మిటరీ హాళ్లు, దీక్షాపరుల సదనం నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

## మళ్లీ పెట్రో మంట

న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ధరలు శనివారం మరోసారి పెరిగాయి. ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఇది మూడోసారి పెరగడం. దేశవ్యాప్తంగా, అన్ని వేరియంట్లలోనూ తాజాగా లీటరుకు సగటున 90పైసలు పెరిగింది. అంతేగాకుండా, ఉత్తర భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచరుల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర ఇదే కాల వ్యవధిలో మూడోసారి కిలోకు రూపాయి చొప్పున పెరిగింది. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు పెరిగి లీటరు ధర రూ.99.51కి చేరుకోగా, డీజిల్ ధర 91పైసలు పెరిగి, లీటరుకు రూ.92.49కి చేరుకుంది. ప్రీమియం వేరియంట్ డీజిల్ ధర లీటరుకు రూ.97.81కి చేరింది. ఇక హై ఆక్టేన్ వేరియంట్‌కి చెందిన పెట్రోల్ ఎక్స్‌పి 95 ధర 87పైసలు పెరిగి లీటరు ధర రూ.106.63కి చేరుకుంది. ఇతర మెట్రోలు ముంబయి, ఢిల్లీ, చెన్నైలతో పోల్చుకుంటే కోల్‌కతాలో ఎక్కువగా ఈ పెంపు కనిపిస్తుంది. అలాగే ఇతర మెట్రోలతో పోలిస్తే చెన్నైలో పెంపు ఒక మోస్తరుగానే వుంటుంది. చెన్నైలో 82పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.105.31కి పెరగగా, డీజిల్ ధర 87పైసలు పెరిగి లీటరు రూ.96.98కి చేరింది. తాజాగా కోల్‌కతాలో లీటరు పెట్రోల్‌కు 94పైసలు పెరిగి లీటరు రూ.110.64కి చేరుకుంది. డీజిల్ కూడా 95పైసలు పెరిగింది. లీటరు ధర రూ.97.02కి చేరుకుంది. ముంబయిలో 90పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.108,49కి చేరుకోగా, డీజిల్ ధర 94పైసలు పెరిగి, లీటరు ధర రూ.95.02కి చేరుకుంది. ఢిల్లీలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి)లో సిఎన్‌జి ధర కిలోకు రూ.81.09కి చేరుకుంది. మే 15నుండి వరుసగా పెరుగుతున్న ధరల పెంపుతో ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు మొత్తంగా లీటరుకు రూ.4.8 చొప్పున పెరిగాయి. మొట్టమొదటసారిగా లీటరుకు మూడు రూపాయిలు చొప్పున పెరగగా, ఆ తర్వాత సగటున లీటరుకు 90పైసలు చొప్పున రెండుసార్లు మే 19, 23 తేదీల్లో పెరిగాయి. పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకం కలిగింది. దాంతో ముడి చమురు ధరలు బాగా పెచ్చరిల్లాయి. ఈ నేపథ్యంలో చమురు మార్కెటింగ్ కంపెనీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

## వైకాపా గొడ్డలి పార్టీ.. సమాజానికి హానికరం

చిత్తూరు: అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైకాపా గొడ్డలి పార్టీయేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని, ఆ పార్టీ 'నెవర్ ఎగైన్' అనే నినాదాన్ని ప్రజలంతా వినిపించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ప్రజల్ని కోరారు. రాష్ట్రంలో జనాలను కాపాడే రాజకీయాలు ఒకవైపు ఉంటే, భయపెట్టి మోసం చేసే రాజకీయాలు మరోవైపు ఉన్నాయని పేర్కొన్నారు. శనివారం చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించడానికి వచ్చిన చంద్రబాబు 14.కండ్రిగ గ్రామంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'సూపర్ సిక్స్‌ను సూపర్‌హిట్ చేస్తే గొడ్డలి పార్టీ తట్టుకోలేకపోతోంది. నోరు తెరిస్తే అబద్ధాలు ఆడుతూ.. మీడియా ముందుకొచ్చి నాటకాలు చేస్తున్నారు. ఇదంతా గొడ్డలి పార్టీ నైజం' అని వైకాపాను ఉద్దేశించి విమర్శించారు. కోడికత్తి, గులకరాయి డ్రామా, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహం డోర్ డెలివరీ, మాస్క్ అడిగిన వైద్యుడు సుధాకర్ ఉదంతాలు సహా వైకాపా హయాంలో జరిగిన 11 నిర్వాకాలను ప్రజలకు చంద్రబాబు వివరించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో తెలుసా అని ఆయన ప్రశ్నించగా సభికులంతా తెలుసని చేతులెత్తారు. 'ఈ పెద్ద మనిషి (జగన్) నేను చంపించానని మాట్లాడుతున్నాడు. ఆరోజూ అలాగే తప్పుడు వార్తలు రాసి రాజకీయ లబ్ధి పొందారు. కుటుంబ బంధాలపైనా గొడ్డలి వేటు వేసి ఆస్తి ఇవ్వకుండా తల్లి, చెల్లికి అన్యాయం చేశాడు. ఇలాంటి వ్యక్తి ప్రజలకు న్యాయం చేస్తాడా? తల్లికి అన్నం పెట్టని వ్యక్తి పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా?' అని చంద్రబాబు దుయ్యబట్టారు. గతంలో హిందూ దేవుళ్లపై అకృత్యాలు, కుట్రలకు పాల్పడ్డారని.. ఇప్పుడు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు రోజుకో నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. పాస్టర్లతోనూ దాడి డ్రామాలు ఆడిస్తున్నారని ధ్వజమెత్తారు.

## నిర్లక్ష్యపు నిర్ణయం

వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న తాత్కాలిక వలసదారులు స్వదేశాలకు వెళ్లి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళనతో పాటు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట నిబంధనలను పాటిస్తూ చేసుకున్న దరఖాస్తులపై నిర్ణయాన్ని పూర్తిగా అధికారుల విచక్షణకు వదిలేయడమేంటని చట్టసభ సభ్యులతోపాటు న్యాయ నిపుణులు మండిపడుతున్నారు. ఇది నిర్లక్ష్యపూరిత, తప్పుడు నిర్ణయమని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఇది చట్టపరంగా చెల్లుబాటు అవుతుందా అనే ప్రశ్నతో పాటు... భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో దౌత్యపరమైన ఒత్తిడి పెంచటంలో భాగంగా ట్రంప్ సర్కారు తీసుకున్న ఎత్తుగడా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. తాజా నిబంధన.. అమెరికాలోని 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంపై జారీ చేసిన మెమోను వెనక్కి తీసుకునే వరకూ ప్రతి వేదిక మీదా పోరాడతామని డెమోక్రటిక్ పార్టీ చట్టసభ సభ్యులు తేల్చి చెప్పారు. ఈ చర్య ఎంతో కాలంగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ గ్రీన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ఆశనిపాతమని బైడెన్ హయాంలో శ్వేత సౌధం సలహాదారుగా పని చేసిన అజయ్ భుటోరియా పేర్కొన్నారు. అమెరికాలోని ప్రతి చట్టాన్నీ గౌరవిస్తూ చట్టబద్ధ నివాసం కోసం ఎదురు చూస్తున్న వారిని ఇబ్బందుల్లోకి నెట్టడమేనని అభిప్రాయపడ్డారు. ఐ485కు దరఖాస్తు చేసుకున్నవారు అన్ని నిబంధనలను పాటించినా వాటిని పరిశీలించకుండానే తిరస్కరించే విచక్షణాధికారం అమెరికా అధికారులకు లభిస్తుందని, ఇక నుంచీ చట్టబద్ధ అర్హతలు ఎంత మాత్రం సరిపోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదో లాజిక్ లేని నిర్ణయమని, దీనివల్ల నిపుణులు ఇతర దేశాలకు వలస వెళ్తారని క్యాటో ఇన్‌స్టిట్యూట్ వలస విభాగం డైరెక్టర్ డేవిడ్ జె.బైర్ స్పష్టం చేశారు. అమెరికాలో వేల మంది గ్రీన్ కార్డు దరఖాస్తుదారులు ఉన్నారని, వారిలో నర్సులు, టీచర్లు, ఇంజినీర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వారందరినీ దేశం నుంచి పంపించేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని టెక్సాస్ కాంగ్రెస్‌మన్ జోక్విన్ క్యాస్ట్రో అభిప్రాయపడ్డారు.

## భవిష్యత్తులో యుద్ధాలు ఇలా ఉంటాయి

భవిష్యత్తులో జరిగే యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, వాటితో పాటు సైబర్‌స్పేస్, కాగ్నిటివ్ (జ్ఞాన) రంగాల్లోనూ జరుగుతాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. శనివారం మహారాష్ట్రలోని షిర్డీలో ఎన్ఐబీఈ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధాలు సంప్రదాయ బలగాలపై మాత్రమే ఆధారపడి ఉండవని జనరల్ చౌహాన్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, డ్రోన్లు, సైబర్ వ్యవస్థల వంటి అధునాతన సాంకేతికతలు భవిష్యత్ యుద్ధ క్షేత్రాన్ని నిర్దేశిస్తాయని వివరించారు. "యుద్ధభూమి ఇకపై భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాదు. సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ వ్యవస్థలు కూడా అందులో భాగమే" అని ఆయన తెలిపారు. సాంకేతిక ఆవిష్కరణ, వేగవంతమైన అనుసరణ సామర్థ్యమే భవిష్యత్ ఘర్షణల్లో వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు షిర్డీ విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి చెందిందని, నేటి నుంచి రక్షణ తయారీ, పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు కూడా కేంద్రంగా గుర్తింపు పొందుతుందని జనరల్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది విశ్వాసం, భవిష్యత్ సాంకేతికతల అద్భుతమైన కలయిక అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా దేశీయ రక్షణ తయారీ రంగం గణనీయమైన వృద్ధిని సాధించిందని సీడీఎస్ గుర్తుచేశారు. ప్రస్తుతం దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ సుమారు రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, రక్షణ ఎగుమతులు రూ.38,000 కోట్లు దాటాయని వెల్లడించారు. 100కు పైగా దేశాలకు భారత రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు.

## మోదీకి అమెరికా ఆహ్వానం.. మార్కో రూబియోతో కీలక భేటీ

ఢిల్లీ : నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**అమెరికా రాయబారి ట్వీట్**

ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికాభారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండోపసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి.

## బాధిత కుటుంబానికి స్నేహితులు చేయూత



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం లోని పొనుగోడు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ కుటుంబానికి 10th క్లాస్ బ్యాచ్ మిత్రులు సహాయ సహకారాలతో ₹30,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చామకూరి అంజయ్య మాట్లాడుతూ, "మీ కుటుంబానికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా మేమంతా అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమంలో చామకూరి అంజయ్య, నందిపాటి శ్రీను, పంగ నాగయ్య, మంగ సైదులు, కానుగు గురుస్వామి, బత్తిని విజయ్, బండి నాగయ్య, మద్దిమడుగు అరవింద్, రణపంగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓగా ఆర్వీ రాధాబాయి బాధ్యతల స్వీకరణ

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓ గా నియమితులైన ఆర్వీ రాధాబాయి శనివారం ఉదయం భాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీఓ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. జిల్లా పరిపాలన లో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధి జరగాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: పార్టీలకతీతంగా అభివృద్ధి జరిగినప్పుడే వాటి ఫలాలు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కోర్టు కాంప్లెక్స్ లో మున్సిపల్ సాధారణ నిధుల కింద రూ.15 లక్షల తో సిసి రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి కార్యక్రమాలకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందెమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గ్రంథాలయ చైర్మన్ కొప్పుల మదన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు అప్పి, పెంటయ్య, శ్రావణి, నరేష్, కొప్పునూరు ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్, ఇబ్రహీం, ముబారక్ అలీఖాన్, సాదిక్ లతో పాటు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, న్యాయవాద బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పట్టణ మహిళా న్యాయవాదులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీజీ పాలీసెట్ ఫలితాల్లో "స్టేట్ ప్రథమ" ర్యాంకు సాధించిన స్లేట్ విద్యార్థిని



ప్రజాస్ఫూర్తి , జన్నారం : శనివారం విడుదలైన టీజీ పాలిసెట్ 2026 ఫలితాల్లో జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ పాఠశాలకు చెందిన అల్వియా షిఫాలి స్టేట్ ప్రథమ ర్యాంక్ సాధించినట్లు స్లేట్ విద్యాసంస్థల ఛైర్మెన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అల్వియా షిఫాలి ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుందని, అలాగే ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర 25వ ర్యాంకు సాధించిందని ఆయన తెలిపారు. స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించిన అల్వియా షిఫాలీ మొదటి నుండి ఎంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదివేదని, టెన్త్‌లో మండల టాపర్‌గా నిలవడమే కాకుండా, ఇప్పుడు పాలిసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం తమ పాఠశాలకే కాక మంచిర్యాల జిల్లా మొత్తానికి గర్వకారణం" అని కొనియాడారు. విద్యార్థినిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అల్వియా షిఫాలీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. శనివారం నగరంలోని ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్ వద్ద "గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు" ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన "సెంట్రింగ్ పని బంద్" ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలమని, సెంట్రింగ్ కార్మికులంతా ఒకతాటిపై ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడినప్పుడే వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయన్నారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ నుంచి శాశ్వత గుర్తింపు కార్డుతో పాటు 55 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి 3000 రూపాయల పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడికి ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ నుంచి ప్రభుత్వ వారి చెల్లించి నష్టపరిహారాన్ని 20 లక్షలకు పెంచాలన్నారు. సంక్షేమ బోర్డు తో సంబంధం లేకుండా సెంట్రింగ్ కార్మికుడు ప్రమాదాల బారిన పడితే పోలీస్ స్టేషన్లో నమోదైన ఎఫైర్ ప్రామాణికంగా చేసుకొని నష్టపరిహారం చెల్లించాలన్నారు. సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని, సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు బిఆర్ఎస్ పార్టీ వారికి మద్దతుగా నిలిచి సెంట్రింగ్ కార్మికుల సమస్యల పై పోరాడేందుకు టిఆర్ఎస్ పార్టీ వారికి మద్దతుగా ఉంటుందని అన్నారు. భవన నిర్మాణ ప్రాంతాలలో తరచూ సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనానికి గురవుతుందన్నారు. అట్టి మెటీరియల్ను దొంగిలించిన వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సెంట్రింగ్ మెటీరియల్ ను దొంగతనంగా కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే మెటీరియల్ మాదిరిగానే సెంట్రింగ్ మెటీరియల్ కు ప్రత్యేక గుర్తింపునిస్తూ దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సెంట్రింగ్ పద్ధతిలో ఉన్న వారికి ప్రతి అమావాస్యకు చట్టబద్ధంగా సెలవుదినంగా ప్రకటించి కార్మిక , పోలీస్ శాఖల సహకారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కృష్ణ, చైర్మన్ ఎస్ పరశురాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి. చాంద్ పాషా, జై దుర్గ భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, షాపూర్ నగర్ జోన్ అధ్యక్షులు మక్బుల్, దుండిగల్ జోన్ అధ్యక్షులు సదానందం, ఉపాధ్యక్షులు సిహెచ్. సత్తిబాబు, కుంటి వీరేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, కోశాధికారి ఎం.వీరేష్, శివశంకర్, శ్రీనివాస్, వివిధ వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు బి.యాదగిరి, పి.వీరేష్, వి.రాకేష్, ఈశ్వర్, కృష్ణ, మహంకాళి రావు, సత్యనారాయణ, ముని, సంజీవులు వెంకటేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**: కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి శనివారం వరకు యువజనోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన 105 మంది యువతీ యువకులకు ప్రొవిజినల్ ఆఫర్ లెటర్లను అందజేశారు. అనంతరం సీఎం కప్ - 2026తోపాటు ఇతర క్రీడా పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, సమ్మర్ క్యాంపుల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన యువతకు మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం ఆధ్వర్యంలో రూపొందించిన "తెలంగాణ టూరిజం బ్రాండ్ కిట్ - తెలంగాణ జరూర్ ఆనా"ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి యం. పరంధామ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పృథ్వి, ప్రశాంతి నగర్ సర్పంచ్ లైలా, శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ వనజ, క్రీడ కోచ్‌లు అబ్దుల్ నబి, కాశీ హుస్సేన్, నాగేశ్వర్ రావు, లగడపాటి రమేష్, శ్రీనివాస్, డానియల్ రాంబాబు, నవీన్, గిరి ప్రసాద్, నాగేంద్ర, జగన్నాధ్, పాపరాజు, శ్రీనివాస్, నాగ శివాజీ, మల్లికార్జున్, ప్రమీల, రవి కిరణ్, అఖిల్, కార్యాలయ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా తిప్పర్తి శ్రీధర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ పార్టీ మహబుబాబాద్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మహబూబాబాద్ పట్టణంలోని గుమ్ముడురు ప్రాంతానికి చెందిన తిప్పర్తి శ్రీధర్ ఎంపికయ్యారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ 33 జిల్లాల అధ్యక్షులను ప్రకటించారు. యువకులు, విద్యావంతులు, సామజిక స్పృహ కలిగిన వారికి ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, దళిత ఉద్యమల్లో విద్యార్థి దశ నుండి తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి బాధ్యతలు కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల ఆదేశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తనని నాకు ఈ యొక్క పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షులు, ఉమా మురళి నాయక్, జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, విప్ రాంచంద్రనాయక్ కోరం కనకయ్య, యశస్విని రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు

## సిద్దాపూర్ లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చెయ్యొద్దు

*** ఇములనర్వ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని ఇములనర్వ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఇందుకోసం సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలో 330 ఎకరాల అసైన్ భూమి సేకరించి టీజీఐఐసీకి అప్పజెప్పిందని తెలిపారు. పరిశ్రమలు వస్తే తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని భావించిన స్థానిక రైతులు యువతకు ఇప్పుడు అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు స్థలం కేటాయించడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ కేటాయిస్తున్నారన్న వార్తతో స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో భూగర్భ జలాలు విషపూరితమవటం అవడంతో పాటు చర్మవ్యాధులు ఏర్పడతాయని ఇక్కడ స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత పొలాలు నాశనమై పశువులు ఆరోగ్యం దెబ్బతిని మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రాంత పరిసర గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉపాధి నిచ్చే పరిశ్రమలు కావాలని కాలుష్యం పంచే డంపింగ్ యార్డ్ మాకొద్దని ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని ఇములనర్వ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సీతంపేట – రాఘవాపురం బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తాం

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: సీతంపేట - రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ.5.54 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ రూ.4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహశీల్దార్ వి.వరప్రసాద్, ఎంపిడివో భారతి, ఆరడబ్ల్యూఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్, ఎంఈఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బద్రినాయక్



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అజ్మీర బద్రీనాయాక్ ను నియమిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియామకానికి కృషి చేసిన ఎంపీ గెడం నగేష్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రఘునాథ్ రావు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

# సమన్వయంతో గంజాయిని నిర్మూలించాలి: కలెక్టర్ కె. హరిత ఆదేశం



ప్రజా స్ఫూర్తి, కోమురాం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగంపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావులతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుండి వచ్చే వాహనాలను రవాణా శాఖ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అడవుల్లో గంజాయి సాగు జరగకుండా అటవీ శాఖ అధికారులు నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి సాగుకు పాల్పడితే వారికి ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. కల్లు కాంపౌండ్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, అక్కడ విక్రయించే తెల్లకల్లు శాంపిల్లను సేకరించి పరీక్షించాలన్నారు. పాఠశాలల పరిసరాల్లోని వంద మీటర్ల లోపు ఉన్న పాన్ డబ్బాలను తనిఖీ చేయాలని, మెడికల్ షాపులను నిఘాలో ఉంచి అధిక మోతాదులో మత్తుమందులు కొనుగోలు చేసేవారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి మహమ్మారి వల్ల ఆరోగ్యం క్షీణించి, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన కలెక్టర్.. దీని నివారణకు గ్రామాల్లో, అలాగే ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ హరిత కోరారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల ఆరోగ్య రక్షణకు హెచ్.పి.వి వ్యాక్సిన్ కీలకం

* డాక్టర్ అనురాధ



జనగామ,ప్రజాస్ఫూర్తి: ఆడపిల్లల్లో భవిష్యత్తులో వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ సహా అనేక క్యాన్సర్ వ్యాధులను నివారించడం లో హెచ్.పి.వి వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని యూపీ హెచ్‌సీ ధర్మకాంచ ఇన్‌చార్జి డా. అనురాధ తెలిపారు. శనివారం పట్టణంలోని ధర్మకాంచ యూపీ హెచ్‌సీలో ప్రత్యేక హెచ్.పి.వి వ్యాక్సినేషన్ డ్రైవ్ కొనసాగుతోందని, 1415 సంవత్సరాల వయస్సు గల ఆడపిల్లలకు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించాలని ఆమె సూచించారు. మూడవ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి ఆధ్వ ర్యంలో బాలాజీ నగర్‌కు చెందిన ఆడపిల్లలను తల్లిదండ్రుల తో కలిసి యూపీహెచ్‌సీకి తీసుకు వచ్చి వైద్య సిబ్బంది పర్యవేక్షణ లో వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ దేశంలో మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్ గా సర్వికల్ క్యాన్సర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. దీనిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంద న్నారు. ఈ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైందని, శాస్త్రీయంగా నిరూపితమైందని పేర్కొంటూ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తల్లిదండ్రుల సమ్మతి పత్రం తో వ్యాక్సినేషన్ నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మే 23వ తేదీ నుంచి వారం రోజుల పాటు యూపీ హెచ్‌సీ లో ప్రత్యేక ఛాతీ ఎక్స్‌రే శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయాసం, దగ్గు, దమ్ము, ఛాతి నొప్పి, టిబి చరిత్ర, బీపీ, షుగర్,దీర్ఘకాలిక వ్యాధులు, బరువు తగ్గడం వంటి సమస్యల తో బాధపడుతున్న వారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, సెలవు ల సమయంలో తల్లిదండ్రులు తమ కుమార్తెలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రేవతి, స్వాతిక, సీపీఎం నాయకులు, వైద్య సిబ్బంది, ఆశా కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



జనగామ, ప్రజాస్ఫూర్తి: పట్టణం లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరిశీలించా రు. మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే రైల్వే స్టేషన్ లో జరుగుతున్న సుందరీకరణ పనులను అయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక 21వ వార్డులోని స్మశాన వాటికలో కొనసాగుతున్న పున రుద్ధరణ పనులను పరిశీలించా రు. పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల ని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి

* డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. శనివారం రెబ్బెన మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కిషన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి సభకు ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షుడు ప్రకాష్‌రావు, అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, జిల్లా కార్యదర్శులు దుర్గం దేవాజీ, చిరంజీవి గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చెన్న సోమశేఖర్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ ప్రకాష్ రావులతో పాటు సర్పంచులు, మాజీ సర్పంచులు , ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, యువజన కాంగ్రెస్, మహిళా విభాగం, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బీటెక్ ఫలితాలలో శ్రీ చైతన్య ప్రభంజనం




పాలేరు, ప్రజా స్ఫూర్తి : జె న్ టి యూ హైదరాబాద్ విడుదల చేసిన చివరి సంవత్సర రెండవ సెమిస్టరు పరీక్ష ఫలితాలలో పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని యశస్విని 9.6 ఎస్ జి పి ఎ,లిఖిత్ , సుజిత్ 9.4 ఎస్ జి పి ఎ ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ లో రాజేష్ , గాయత్రి సౌమ్య 9.55 ఎస్ జి పి ఎ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థిని హేమలత 9.4 ఎస్ జి పి ఎ తో యూనివర్సిటీ స్థాయిలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించారని,9.0 ఎస్ జి పి ఎ కి పైన 78 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ అధ్యాపకులచే తయారు చేయబడిన ప్రాక్టికల్ తో కూడిన మైక్రో షెడ్యూల్ తో పాటు ప్రతి సబ్జెక్టుకు తరగతి బోధనతో పాటు,ప్రాక్టికల్ కూడా నిర్వహించడం వలన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో దోహదపడిందని అన్నారు. ఈ ఫలితాలు యూనివర్సిటీ స్థాయిలోనే అత్యుత్తమ ఫలితాలని, ఈ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులను విద్యార్థులని అభినందనలు తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం. ఈ ఫలితాలు మా నాణ్యమైన బోధన , ఫ్యాకల్టీ బృందం అందించిన నాణ్యమైన బోధన, విద్యార్థుల అంకితభావం ఈ ఫలితాల వెనుక ప్రధాన కారణం నిదర్శనం అని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల, సాధన ద్వారానే,సాధ్యమవుతుందని, అది మా విద్యార్థులకి కళాశాలలో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే అవలంబించేలాగా ప్రణాళికలు సిద్ధం చేశామని,విద్యార్థులు నిరంతరం సృజనాత్మకంగా, క్రమశిక్షణతో పాఠాలు నేర్చుకోవడం వల్లే ఈ ప్రతిభ సాధ్యమైంది. భవిష్యత్తులో కూడా ఇలాగే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఆకాంక్షిస్తున్నామ అని అన్నారు. కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన మాట్లాడుతూ మెరుగైన ఫలితాలు సాధించడంలో విద్యార్థుల పాత్ర ఎంత కీలకమో అధ్యాపకుల పాత్ర కూడా అంతే ఉంటుందని, సిలబస్ లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులను ఎప్పటికప్పుడు నిష్ణాతులైన నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణప్రసాద్ , వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ చార్యులు , డాక్టర్ ప్రణతి, సురేష్, శ్రీ కుమార్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై జేఎస్ఎస్ రాజీలేని పోరాటం

* జేఎస్ఎస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఎల్. దేవేందర్ నాయక్.



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల సమస్యలపై జేఎస్ఎస్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర జేఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు లావుడియా దేవేందర్ నాయక్ అన్నారు. శనివారం జేఎస్ఎస్ కార్యవర్గ సమావేశం హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమ సంఘం సిద్దిపేట అధ్యక్షుడిగా పరకాల వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఈసీ మెంబర్ ఎల్ దేవేందర్ నాయక్ సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షునిగా పరకాల వంశీ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్ నియమితులయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా కొయ్యడ అనిల్ కుమార్ సహాయ కార్యదర్శిగా ఎం. దామోదర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్త పూర్ణచందర్, కోశాధికారిగా కాపర్తి శ్రీకాంత్, మరియు జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొర్ల విజయకుమార్, వికాస్ బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ జాతీయ అధ్యక్షులు మనసాని కృష్ణారెడ్డికి రాష్ట్ర అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఈసీ మెంబర్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, జాతీయ మరియు రాష్ట్ర నాయకత్వం అందించిన ఆదేశాల మేరకు ఈ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రోజు నుంచే ఈ కమిటీ జిల్లాలో అధికారికంగా తన విధులను ప్రారంభిస్తుందని ప్రకటించారు. జర్నలిస్టుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం జె.ఎస్.ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ద్వారా సాధించుకోవడంలో ఈ సంఘం ముందుంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్ కార్డులతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టు హక్కుల రక్షణ కోసం జె.ఎస్.ఎస్ ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని ఆయన వివరించారు.

# రైతు అకాల మరణం వార్తలో నిజం లేదు

* జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న గణపూరు గ్రామంలో వెంకటాపురం శంకరయ్య అనే రైతు అకాల మరణం అనే వార్తను పలు పత్రికలు ప్రచురించిన దృశ్య ఆ వార్తలో కొన్ని పత్రికలు నిజాన్ని వక్రీకరించి రాసినట్లు జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు అకాల మరణం పట్ల కుల్చారం మండల తహసీల్దార్ నివేదిక ప్రకారం, సంబంధిత రైతు గుండెపోటుతోనే మరణించినట్లు వారి కుటుంబ సభ్యులు కూడా ఇదే విషయాన్ని తెలియజేసినట్లు నివేదికలో పేర్కొనబడినది. సంబంధిత రైతు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన సీరియల్ విధానం ప్రకారమే కొనసాగుతున్నది.అయితే కొన్ని దినపత్రికలలో ధాన్యం కొనుగోలు సమస్యల కారణంగానే రైతు మృతి చెందినట్లు ప్రచురించబడిన వార్త అవాస్తవమని తెలియజేశారు. దీనిని ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో ముడిపెట్టి ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడగా 30,210 మంది రైతుల ఖాతాల్లో రూ.336.65 కోట్లను నేరుగా జమ చేయడం పూర్తయింది.నిరంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షలు నిర్వహిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ కొనుగోలు కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జెండా ఆవిష్కరణ నిర్మాణానికి భూమి పూజ

* తెలంగాణ రాష్ట్ర సేన ఇంచార్జ్ వీరప్పరి రమేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : మెదక్ జిల్లా కేంద్రంలోని జెండా పండుగ లో భాగంగా శనివారం తెలంగాణ రాష్ట్ర సేన(టిఆర్ఎస్) ఆధ్వర్యంలో జెండావిష్కరణ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మెదక్ జిల్లా,మండల కేంద్రం, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ లలో నిర్మాణాలు చేపట్టి జెండా పండుగన విజయవంతం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవితక్క పంచ జన్య ఉపాధి అవకాశాలు వ్యవసాయం, ఉచిత, విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగ అవకాశాలు మేనిఫెస్టోలో ఆధారంగా యువత తెలంగాణ రాష్ట్ర సేన వైపు చూస్తున్నారని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సేన అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలంగాణ రాష్ట్ర సేన సీనియర్ నాయకులు మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ వీరప్పరి రమేష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేవల్ నందకిషోర్, హరీష్, రమేష్ తదితరులు ఉన్నారు.

# మండే ఎండలకు చల్లని మజ్జిగ పంపిణీ

* కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద సేవా కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద శనివారం జర్నలిస్టు కొండ్లె కృష్ణయ్య గుప్త తన అమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధా బ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్ హాజరై బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, టీవీఎస్ షోరూం యజమాని కర్నాటి నాగేశ్వరరావు,జూలకంటి నాగరాజు, శ్రీరంగం రాము, యామా సంతోష్ తదితరులు పాల్గొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని నిర్వాహకులు కొండ్లె కృష్ణయ్య గుప్త తెలిపారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మార్కెట్ లో ధాన్యపు కుప్పలు.. రైతుల కండల్లో కన్నీళ్లు


జనగామ, ప్రజాస్ఫూర్తి: వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం నేతలు ఆరోపించారు. శనివారం వ్యవసాయ మార్కెట్ లోని ఐకేపీ కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి తీగల సాగర్, రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ సందర్శించి రైతుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలన్నర రోజులుగా ధాన్యపు కుప్పలు మార్కెట్ యార్డులోనే ఉండిపోవ డంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.అకాల వర్షాల భయం,తడిసి పోతున్న ధాన్యం కారణంగా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి, ముఖ్య మంత్రి చెబుతు న్నప్పటికీ క్షేత్రస్థాయి లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతు లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు



జయశంకర్ భూపాలపల్లి కాళేశ్వరం,ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం ఆలయానికి చేరుకున్న మహారాజ్‌కు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. పార్వతి (శుభానంద) దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు, భక్తులకు ధార్మిక సందేశం అందించారు. ఆలయం తరుపున స్వామివారి శేష వస్త్రాలను మహారాజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ శర్మ, ఆర్జేసీ రామకృష్ణ, ఈవో మహేష్, ఆలయ అధికారులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహా సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీ అంబా భవాని మాత దేవాలయ నూతన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చంద్రయ్య



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పదవులు తీసుకోవడమే కాదు వాటికి వన్నెతెచ్చే విధంగా మనం చేసే పనులు గొప్పగా ఉండాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట శ్రీ అంబా భవాని మాత దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం నూతన అభివృద్ధి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చాకలి చంద్రయ్య, కమిటీ సభ్యులు నాగారం రాంరెడ్డి, బాలరత్నం గౌడ్, ముత్యాల రాములు, జంగం లింగం, మహేష్, రేణుకలతో ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నూతన అభివృద్ధి కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దేవాలయానికి అత్యంత ప్రాముఖ్యత ఉందని అన్నారు.

## కోట్లాది మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి మంత్రి కోమటిరెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం రాష్ట్ర రాజధాని అంబేద్కర్ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదినం సందర్భంగా కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి లేని దేవుడు కోట్లాది మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాడని, ఆయన జననం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఒక్క వరం లాంటిదని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నారు. తాను చిన్నప్పటి నుంచి సేవాగుణంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయంలో ఒక ప్రత్యేకత, ఒక్కి గుర్తింపు సాధించిన గొప్ప నేతగా ఎదిగారని ప్రజల పక్షాన నిరంతరం నిర్భయంగా పోరాడుతూ ప్రజాస్వారంగా ఎదిగిన మహోన్నత వ్యక్తి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని కొనియాడారు గ్రామీణ స్థాయి కార్యకర్త నుండి రాష్ట్ర రాజకీయాలను సాధించే స్థాయికి ఎదిగిన గొప్ప నాయకుడు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజానేతగా నేడు అందరి హృదయాలలో గుడి లేని దేవుడు ఇలా చిరస్థాయిగా నిలిచినా మహోన్నత వ్యక్తిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడని కొనియాడుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, పిట్టల బాలరాజ్, హీరే కార్ శ్రీనివాస్ పన్నాల మల్లికార్జున రెడ్డి సర్పంచ్, సుబ్బురు సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి

*** ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిర్వహించిన వేద పాఠశాల భవన నిర్మాణ సముదాయానికి భూమి పూజా కార్యక్రమం మరియు రూ.100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి అభివృద్ధి, ఆధ్యాత్మిక వైభవాన్ని మరింతగా పెంపొందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర ఆధ్యాత్మిక అభివృద్ధికి మరింత దోహదపడతాయని అన్నారు.

# హంతకులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తాం

*** సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ.**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: హత్యకు గురైన ఏర్కారం గ్రామానికి చెందిన మధు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి నందు ఎస్పి నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ మృతుని బంధువులతో మాట్లాడారు. హంతకులను త్వరగా పట్టుకుంటామని, కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా పోలీసు శాఖ కృషి చేస్తుందని బంధువులకు ఎస్పి హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి ఏర్కారం గ్రామ శివారులో రోడ్డు పక్కన కల్వర్టు క్రింద గోనె బస్తాలో శవం ఉన్నదన్న సమాచారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే మృతదేహాన్ని బయటికి తీశారు. గోనె సంచిలో దొరికిన మృతి దేహం ఎర్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు గా గుర్తించి బంధువులను పిలిపించి నిర్ధారించినట్లు ఎస్పి నరసింహ తెలిపినారు. కాగా చింతలపాటి మధు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో నుండి వెళ్ళాడని ఆచూకీ తెలియడం లేదని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు అతని భార్య ఫిర్యాదు చేసింది. మొదటగా ఈ ఫిర్యాదు పై మిస్సింగ్ కేస్ నమోదు చేసి, హత్య కేసుగా మార్పు చేయడం జరిగింది. ఈ కేసును సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ దర్యాప్తు చేస్తున్నారు, డి.ఎస్.పి ప్రసన్నకుమార్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నిందితులను పట్టుకోవడం కోసం 5 ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశాం, నిందితులను పట్టుకుని కఠిన శిక్షలు పడేలా త్వరితగతిన దర్యాప్తు చేస్తాం అన్నారు. నిందితులపై పీడి యాక్ట్ పెట్టి బెయిల్ దొరకకుండా జైలులోనే ఉండేలా కృషి చేస్తామని అన్నారు. సంఘటనపై టెక్నికల్ ఆధారాలు సాక్షుల ఆధారాలు బలంగా నమోదు చేస్తామని అన్నారు.చట్ట వుల్లంఘన చర్యలకు పాల్పడుతూ భౌతిక దాడులు చేస్తూ హత్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు అమలైతాయని పోలీసు అత్యంత వేగంగా కేసులు దర్యాప్తు చేస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలో గతంలో జరిగిన హత్య కేసులలో నిందితులకు శిక్ష పడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసు పట్టిష్టంగా దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరగా పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం మృతదేహం లభించిన సంఘటన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

## ఘనంగా మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు వేడుకలు


*** జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్సీ కేతావత్ శంకర్,నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్ పాల్గొని పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేదల పెన్నిధి అని కొనియాడారు. నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడతారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అభిమానులు, ఫ్రూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. అనంతరం నల్గొండ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో మంత్రి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్గొండ మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు,మాజీ కౌన్సిలర్లు,మాజీ జడ్పీటీసీలు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి


*** ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిర్వహించిన వేద పాఠశాల భవన నిర్మాణ సముదాయానికి భూమి పూజా కార్యక్రమం మరియు రూ.100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి అభివృద్ధి, ఆధ్యాత్మిక వైభవాన్ని మరింతగా పెంపొందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర ఆధ్యాత్మిక అభివృద్ధికి మరింత దోహదపడతాయని అన్నారు

## యాదాద్రిలో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు

*** శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన సీఎం**





భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో రూ.99.55 కోట్లతో ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన భూమి పూజలో సీఎం రేవంత్ రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొనగా వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎమ్మెల్సీలు, సీఎంఓ కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## పోచంపల్లి ప్రదర్శనకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

భువనగిరి , ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహించనున్న పోచంపల్లి ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆహ్వానించారు. కళను, హస్తకళను, సాంస్కృతిని ప్రతిభంభించే పోచంపల్లి దారంతో సాంప్రదాయ చేతితో నేయబడిన ప్రదర్శన జూన్ 5,6,7 తేదీ లో హైటెక్స్, హైద్రాబాద్ లో కలదని ఆహ్వాన పత్రికను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : పేకాట స్థావరాలపైన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా ఆధ్వర్యంలో ఆకస్మిక దాడి నిర్వహించారు. పరిగి పట్టణంలో పరిగి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఒక భవనంపై కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం ఈ దాడి చేపట్టారు. ఈ దాడిలో పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 31,450/ల నగదు, పేక ముక్కలు, 5 మొబైల్ ఫోన్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వెంటనే పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా తెలిపారు.

## పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు

**: ఎస్.ఐ శ్రవణ్ కుమార్.**




లింగాలఘనపురం / జనగామ, ప్రజాస్ఫూర్తి: పంట అవ శేషాలు కాల్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రవణ్ కుమార్ హెచ్చరిక. జిల్లా లోని లింగాల ఘణపురం మండలంలో రైతులు పంట అవశేషాలను కాల్చరాదని స్థానిక ఎస్సై హెచ్చరించారు. పంట అవశేషాలను తగల బెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు భూసార నాణ్యత దెబ్బతింటుందని తెలిపారు. అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం కూడా ఎక్కువగా ఉం టుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పంట అవశేషాలను కాల్చినట్లు అయితే సంబంధిత రైతుల పై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు అవశేషాలను సేంద్రియ ఎరువుల తయారీ కి లేదా ఇతర ప్రత్యామ్నాయ విధానాల్లో వినియోగించాలని సూచించారు.

## దేవరుప్పుల పీఎస్‌లో ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లోని దేవరుప్పుల పోలీస్ స్టేషన్ లో శనివారం ఐపీఎస్ అధికారిణి మనీషా నెహ్రా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలు, క్రైమ్ పెట్రోలింగ్ వాహనాలు, కేసు ప్రాపర్టీ రూమ్, జనరల్ డైరీ, క్రైమ్ రికార్డులు తదితర అంశాలను పరిశీ లించారు. సిబ్బంది విధి నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ప్రజలకు భరోసా కలిగించే కేంద్రం గా ఉండాలి. విధుల్లో క్రమశిక్షణ తో పాటు బాధితుల పట్ల సత్వర స్పందన అవసరం అని సిబ్బందికి సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఓటర్ల మ్యాపింగ్‌లో 92.24 శాతం రాష్ట్రంలో మహబూబాబాద్ మొదటి స్థానం

* జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించార,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్ లో రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 92.24 శాతం మ్యాపింగ్ చేసి.రాష్ట్రంలోనే ముందు వరుసలో మహబూబాబాద్ జిల్లా ఉందన్నారు,2002, 2025.రెండు ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్ లో ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో బిఎల్వోలు, భారత్ ఎన్నికల చట్టం ప్రకారం ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని, సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని, ఓటర్ జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణలకు ఆదేశించడం జరుగుతుందని అన్నారు,ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల ఉన్న ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తద్వారా ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు అయి ఉన్నారని, మరణించిన ఓటర్లు పేర్లు తొలగించడం, తదితర సమస్యలను ఉత్పన్నమయ్యాయి అని, అందువలన అర్హుడైన పౌరుడు కూడా ఓటరు జాబితా నుండి తప్పి పోకుండా అలాగే ఏ అనర్హుడు కూడా ఇందులో చేర్చబడుతుందని ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ను ప్రకటించింది అన్నారు,ఎస్ఐఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు,ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ, చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్,సూపర్డెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహి స్తూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటివరకు 1.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, అందు లో ఎక్కువభాగాన్ని మిల్లులకు తరలించినట్లు తెలిపారు. అలాగే రైతుల ఖాతాల్లో రూ.233 కోట్లు జమ చేసినట్లు చెప్పారు.మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో ఎలాంటి ఆలస్యం లేకుండా తూకం, రవాణా, ఓపీ ఎంఎస్ నమోదు పనులను వేగం గా పూర్తి చేయాలని అధికారు లకు సూచించారు.


## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

: వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్ జిల్లా , ప్రజా స్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు ఇటీవల, నిన్న రాత్రి జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురు వాహనదారులకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. దౌలతాబాద్, వికారాబాద్, బంట్వారం, కోటపల్లి, ధరూర్, మర్పల్లి, కరన్‌కోట్, మోమిన్‌పేట్, పెద్దేముల్, నవాబ్‌పేట్, దోమ, తాండూర్ టౌన్, దుద్యాల మరియు కుల్కచర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన నిందితులకు ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు కౌన్సిలింగ్ ఇచ్చారు. వికారాబాద్ డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో డీడీ రెస్పాండెంట్లతో పాటు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ జరిగింది. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడపడమే కాకుండా, నంబర్ ప్లేట్లు లేని , సరైన పత్రాలు (డాక్యుమెంట్లు) లేని వాహనదారులను పిలిపించి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలతో చలగాటమాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని, భవిష్యత్తులోనూ ఈ తనిఖీలు మరింత ఉధృతంగా కొనసాగుతాయని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## 'రైతు గోస భాజపా భరోసా'.. ఏయే రోజుల్లో ఎక్కడంటే..!



హైదరాబాద్: ఈ నెల 25 నుంచి 'రైతు గోస భాజపా భరోసా' పేరిట పోరుబాట నిర్వహించేందుకు భాజపా సిద్ధమవుతోంది. తొలిరోజు తాండూరులో.. రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో.. మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ ఇందులో పాల్గొననున్నారు.

## వర్షా కాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి

: సింగరేణి సీఎండీ



హైదరాబాద్: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలని.. ఈ మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్ సూచించారు. కంపెనీ పంపులతో పాటు కొన్ని ప్రైవేటు పంపులను కూడా ఏర్పాటు చేసి.. నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలోనూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ఆయన శనివారం జీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రతి ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపుపైనా సమీక్షించారు. ''హాల్ రోడ్లను పటిష్ఠపరచుకోవాలి. స్థానికంగా వాతావరణ విభాగం జారీ చేసే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. భారీ యంత్రాలతో పూర్తి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలి. మానవ వనరులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. కంపెనీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను కార్మికులకు వివరిస్తూ.. ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి పాటుపడేలా చైతన్యపరచాలి'' అని చెప్పారు.

## 24 గంటల్లోపు కేసును చేదించిన పోలీసులు

* నిందితురాలని అరెస్టు చేసి రిమాండ్ కు తరలింపు.
* కేసు వివరాలు వెల్లడించిన సిద్దిపేట సిపి రశ్మి పెరుమాళ్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన పేట మండలం మంచినీళ్ళ బండ గ్రామంలో కలకలం రేపిన బోయిని రాజవ్వ హత్య ఉదంతం దొంగతనం కాదు, కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్న భార్యే చేసిన హత్యగా పోలీసులు తేల్చారు. నిందితురాలిని అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.మంచినీళ్ళ బండ గ్రామానికి చెందిన బోయిని కనకయ్య (52) వ్యవసాయంతో పాటు హమాలీ పని చేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య రాజ్యలక్ష్మి, చిన్న భార్య బోయిని రాధ. ముగ్గురూ కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ నెల 21న కనకయ్య హమాలీ పని నిమిత్తం కట్కూర్ గ్రామానికి వెళ్ళాడు.రాత్రి సుమారు 9 గంటల సమయంల గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి పెద్ద భార్య రాజ్యలక్ష్మిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి మెడలోని 3.5 తులాల బంగారు పుస్తెల త్రాడును ఎత్తుకెళ్ళినట్లు కనకయ్యకు సమాచారం అందింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కనకయ్య ఫిర్యాదు మేరకు అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**తేలిన అసలు నిజం**

కేసు నమోదు చేసుకున్న అక్కన్నపేట పోలీసులు రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగినట్లుగా సృష్టించిన సీన్‌పై అనుమానం రావడంతో విచారించగా, అసలు నిజం బయటపడింది. కుటుంబ గొడవల నేపథ్యంలో కనక్కయ్య పెద్ద భార్య యొక్క పెంతనం ఎక్కువ అయి ప్రతి దానికి చిన్న భార్య ను అనుమానం వ్యక్తం చేస్తూ తిడుతుండేది 21 తేది రాత్రి ప్రాంతంలో పెద్ద భార్య చిన్న భార్యతో గొడవ పెట్టుకున్నది. రాజ్యలక్ష్మి నిద్రిస్తున్న సమయంలో రాధతోగొడవ పెట్టుకుంటుందని ఇంట్లో ఉన్న కర్రతో రాజవ్వ తలపైన ,చిన్న భార్య బోయిని రాధనే పెద్ద భార్య రాజవ్వని తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు తేలింది. తను చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి, జిల్లాలో దొంగలు పడుతున్నారనే విషయాన్ని ఆసరాగా తీసుకుని, తానే మెడలోని బంగారాన్ని తీసివేసి ఒక దగ్గర భద్రపరిచి, కదలికలు లేకుండా పడి ఉన్న రాజవ్వనుచూసి చనిపోయింది అనుకొని, ఇంటి ముందుకు వెళ్ళి పెద్ద పెద్దగా కేకలు వేస్తూ. గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసి హత్య చేసినట్లుగా తప్పుడు ప్రచారం సృష్టించింది. పోలీసులు నిందితురాలు బోయిని రాధను అరెస్ట్ చేసి, జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.ఈ సందర్భంగా సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ మాట్లాడుతూ, కేవలం 24 గంటలో వ్యవధిలోనే ఈ కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి నిందితురాలిని పట్టుకున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసులన్నింటినీ పోలీసులు విజయవంతంగా ఛేదించారని పేర్కొన్నారు. "సమాజంలో నేరాలను అడ్డుకోవడానికి, సొంత రక్షణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఫేక్ (నకిలీ) కంప్లైంట్లు ఇస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సమాజ సేవలో 'కోలా' కుటుంబం: ఆదర్శంగా నిలుస్తున్న సుశీల ఫౌండేషన్!




ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ : పౌర సమాజం తమ వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ సమాజం పట్ల బాధ్యత విస్మరిస్తున్న ఈ రోజుల్లో ఓ కుటుంబ సభ్యులంతా ప్రజా సేవకు కంకణబద్ధులై స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంకు చెందిన సామాజిక సేవకుడు,ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ సంరక్షకుడు కోల రవీందర్ ముదిరాజ్ ప్లాస్టిక్ నివారణ, ఈత పాత్యంశంగా చేర్చాలని నిరంతరం తన శక్తికి మించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నాడు. అదేవిదంగా రోడ్ల ఆక్రమణలపై,ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫర్మర్ లపై అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా కృషి చేస్తున్నాడు. ఇలా తన కంటికి కనిపించిన ప్రతీ ప్రజా సమస్యపై స్పందిస్తూ సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటిచెబుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

**ఉచిత మజ్జిగ పంపిణి...:**

ప్రజలకు తమకు తోచిన విధంగా సహాయపడే సద్గుణం గల కోలా రవీందర్ కుమారుడు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కోలా సుశీల ఫౌండేషన్ ద్వారా శనివారం సూరారం లో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి చేతులమీదుగా ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం చేపట్టారు. మండు వేసవిలో అల్లాడిపోతున్న స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేలా చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. మజ్జిగను కోలా శ్రీకాంత్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పంపిణి చేయగా మజ్జిగ తాగి రోడ్డు పై పడేసిన కాలి గ్లాస్ లను రవీందర్ ముదిరాజ్ స్వయంగా తొలగించాడు.ప్రకృతి సంరక్షణలో అతని అంకితభావం పట్ల స్థానికులు ఆశ్చర్యచకితులయ్యారు. ఇలా కుటుంబం సభ్యులు మొత్తం సమాజానికి ఏదన్నా చేయాలనే తపనతో స్వచ్ఛందంగా ముందుకు రావడం చాలా గొప్ప విషయం కదా....!

## ఏఐ కాప్ రైటర్... యాప్ ను ఆవిష్కరించిన సజ్జనార్



పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ 'హైదరాబాద్ నగర పోలీస్' మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషాపరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఏఐ కాప్‌రైటర్' అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆవిష్కరించారు. అనంతరం దాని పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీని ద్వారా 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందని అన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి

* కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి:ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డా. అగర్వాల్ వైద్య నిపుణులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరంలోని వైద్య సేవల నిర్వహణ తీరును పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సమాజంలో ప్రతి ఒక్కరి కీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవాలని, చిన్న సమస్యలను కూడా విస్మరించకుండా వైద్యులను సంప్రదించడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చని తెలిపారు. మొత్తం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్సకు సంబంధించిన సూచన లు అందించారు. కార్యక్రమంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ చైర్మన్ చింతల సాయిబాబా, వైద్యులు శ్రీకాంత్, కరుణాకర్, డీజీఓ ప్రీతి, మేనేజర్ దయాకర్, నిర్వాహకు లు మల్యాల సురేష్, చింతల గణేష్, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

: మంత్రి జూపల్లి



గచ్చిబౌలి: తెలంగాణను పర్యాటకుల గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పర్యాటక రంగమంటే కేవలం వినోదం మాత్రమే కాదని.. దేశ, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే అద్భుత శక్తి అని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితం)లో 'డెస్టినేషన్ తెలంగాణ రోడ్ అహెడ్' పేరిట నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ''రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం అత్యంత కీలకం. పారిశ్రామికవేత్తలు కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ప్రతిపాదనలతో ప్రభుత్వం వద్దకు రావాలి. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుంది. ప్రభుత్వ పరిధిలోని నిరర్థక ఆస్తులను పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి త్వరలోనే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' ప్రకటనలు జారీ చేస్తాం. దీని ద్వారా ఎంపికయ్యే సంస్థలకు సంబంధించిన డిజైన్లు, ప్రాజెక్టుల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, టాయిలెట్లు, వసతి గృహాల వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రైవేటు వ్యక్తులు ముందుకు రావాలి'' అని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు.

## తెలుగు రాష్ట్రాల్లో గాలివాన బీభత్సం... ముగ్గురి మృతి

గత కొన్నిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే శనివారం తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసలపాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ. రహదారి వంటి గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి.



# పదేళ్ల బాలిక హత్యోదంతం.. స్పందించిన సీఎం విజయ్

కోయంబత్తూర్‌లోని దుకాణానికి వెళ్లి అదృశ్యమైన 10 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటన తమిళనాట కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అమానవీయ చర్యలను సమాజం ఎన్నటికీ అంగీకరించబోదన్నారు. ఈ కేసులో త్వరిత గతిన దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. టీవీకే ఎమ్మెల్యే ఎన్ఎం కుమార్ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**రాజకీయంగా దుమారం..**

చిన్నారి హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 రోజుల్లోనే రాష్ట్రంలో నేరాల గ్రాఫ్ పెరిగిందని డీఎంకే విమర్శలు గుప్పించింది. ఈ ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతలపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోందని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అన్నారు. బాలిక హత్యకు బాధ్యులైనవారిని వీలైనంత త్వరగా న్యాయస్థానం ముందు నిలబెట్టి.. కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి విజయ్ అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు వారికి భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ఘటనపై భాజపా నేత నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ.. ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా నాశనం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లోని కణ్ణపాళైయానికి చెందిన 10 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం దుకాణానికి వెళ్లి అదృశ్యమైంది. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. శుక్రవారం ఓ చెరువులో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లినట్లు విచారణలో తేలడంతో అతడితో పాటు మరో అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## ట్విష మృతి కేసు.. సుమోటోగా తీసుకున్న సుప్రీం




దిల్లీ: మాజీ మిస్ పుణె, నటి ట్విషా శర్మ మృతి కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ కేసుపై విచారించే అవకాశం ఉంది. ఇటీవల భోపాల్‌లోని అత్తవారింట్లో ట్విష ఆత్మహత్య చేసుకుంది. అప్పటికి ఆమెకు పెళ్లై ఐదు నెలలే. మృతి చెందడానికి ముందు తన తల్లి, స్నేహితురాలికి ఆమె పలు సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. తాను వేధింపులకు గురవుతున్నానని, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని వాటిల్లో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.

## మోదీ గిఫ్ట్‌గా ఇచ్చిన తామరాకు టీ వెనక స్టోరీ తెలుసా?




ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐదు దేశాల పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. మన దేశ సంస్కృతి, జీవనవిధానం, వారసత్వ సంపదను ప్రతిబింబించేలా ఆయా దేశాల అధినేతలకు కానుకలు ఇచ్చారు. వాటిలో లోక్‌తక్ లోటస్ టీ ఒకటి. ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో ప్రత్యేకంగా తయారు చేసే ఈ టీ పౌడర్‌ను స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌కు కానుకగా అందజేశారు. సాధారణంగా ప్రపంచస్థాయి నేతలు ఖరీదైన కానుకలను ఇచ్చిపుచ్చుకుంటారు. అయితే మోదీ మాత్రం మణిపుర్‌లోని కొండలు, చిత్తడి నేలల నుంచి సేకరించిన టీపొడిని ఇవ్వడం విశేషం. లోక్‌తక్ లేక్.. ఈశాన్య భారతంలోని ఓ మంచి నీటి సరస్సు. ఆ ప్రాంతం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. ఆ నీటిలో సహజంగా దొరికే తామర ఆకుల నుంచి ఈ టీపొడిని తయారు చేస్తారు. మణిపుర్‌లోని థంగా గ్రామంలోని కొందరు మహిళల ఆలోచన నుంచే ఈ టీ పుట్టింది. ఈ సరస్సు దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఈ ఆకులను సేకరిస్తారు. ఆ స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేలలు, జీవవైవిధ్యం వల్ల ఆ టీకి ప్రత్యేకమైన రుచి, సువాసన చేకూరి ప్రత్యేకంగా నిలిపాయి. ఇలాంటి గిఫ్ట్‌ను మోదీ ఎంచుకోవడం వెనక ప్రత్యేక కారణమే ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో తయారవుతున్న ఇలాంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించడమే అసలు ఉద్దేశం. ఇక, ఈ టీతో పాటు స్వీడన్ ప్రధానికి చేతితో తయారు చేసిన శాంతినికేతన్ లెదర్ బ్యాగ్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలను బహూకరించారు. ఇవిగాక.. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి మణిపుర్‌లో తయారయ్యే షిరుయ్ లిలీ పట్టు దుపట్టాను అందించారు. ఇటలీ అధ్యక్షుడు సెర్గియొ మాటరెల్లీకి పండిట్ భీమ్‌సేన్ జోషి, కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఆలపించిన పాటల సీడీలను మార్బుల్‌తో తయారు చేయించిన ప్రత్యేక డబ్బాలో ఉంచి కానుకగా ఇచ్చిన సంగతి తెలిసిందే. మోదీ ఇచ్చిన కానుకల్లో మణిపుర్‌లో పండించే బ్లాక్‌రైస్‌కూడా ఉంది.




### భారతీయుల నుంచి సభ్యత నేర్చుకోండి
## అమెరికా మంత్రికి ఇరాన్ చురక

నాలుగు రోజుల భారత్ పర్యటన కోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో దిల్లీ చేరుకున్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం అమెరికా మంత్రికి చురకలు అంటిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. భారతీయులలో సభ్యత కన్పిస్తుందని.. వారి నుంచి కొంచెమైనా దానిని నేర్చుకోవాలని వ్యంగ్యాస్త్రాలు గుప్పించింది. యుద్ధం ముగింపు చర్చలు కొనసాగుతున్న క్రమంలో అగ్రరాజ్యానికి చెందిన కొందరు నేతలు ఇరాన్‌తో ప్రవర్తిస్తున్న తీరు నేపథ్యంలో ఆ దేశ కాన్సులేట్ ఈ పోస్టు చేయడం గమనార్హం.

**ప్రధానిని కలిసిన రూబియో..**

తన పర్యటనలో భాగంగా తొలుత కోల్‌కతా చేరుకున్న అమెరికా మంత్రి మార్కో రూబియో అక్కడ మదర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీని సందర్శించారు. అనంతరం దిల్లీలోని 'సేవా తీర్థ్'లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జై శంకర్‌తో ఆదివారం విస్తృత చర్చలు జరపనున్నారు. మంగళవారం దిల్లీలో జరిగే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి ఆయన హాజరుకానున్నారు.

## ఎవరెస్టు యాత్రలో విషాద ఘటన.. మృతులిద్దరూ తెలుగు రాష్ట్రాలవారే




ఎవరెస్టు పర్వతారోహణ ముగించుకొని దిగువకు వస్తున్న క్రమంలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల్లో ఒకరైన సందీప్ ఆరే (46) స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపుర్. అయితే, ఆయన అమెరికాలో స్థిరపడినట్లు తెలిసింది. మరో పర్వతారోహకుడు అరుణ్‌కుమార్ తివారి (53) ఉత్తర్ ప్రదేశ్‌కు చెందినప్పటికీ హైదరాబాద్‌లో స్థిరపడిన వ్యక్తిగా తెలుస్తోంది. అయితే, వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉండటం గమనార్హం. సందీప్ ఆరే సమీప బంధువు తెలిపిన వివరాల ప్రకారం..మే 20వ తేదీన సందీప్ ఎవరెస్టును అధిరోహించాడు. మరుసటి రోజు తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన ప్రాణాలు కోల్పోయారు. సాహస యాత్రలంటే ఇష్టపడే సందీప్.. కిలిమంజారో వంటి అనేక పర్వత శిఖరాలను అధిరోహించాడు. అయితే, ఆయన తల్లిదండ్రులకు మాత్రం ఈ యాత్రలంటే ఇష్టం లేదని సమాచారం. ఓ ఐటీ కంపెనీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ తివారికి పర్వతారోహణలో ఎంతో అనుభవముంది. రష్యా, అమెరికా, అర్జెంటీనాల్లోని ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాజాగా ఎవరెస్టును అధిరోహించిన తర్వాత కిందకు దిగే క్రమంలో వీరిద్దరు అలసిపోయి ఉండవచ్చని నేపాల్ ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రిషి భండారీ పేర్కొన్నారు. వారి గైడ్‌లు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ వారిని కాపాడలేకపోయారని చెప్పారు. వీరిద్దరి మృతదేహాలను కిందకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

## రాజ్యసభ సీటును అమ్మేసిన ఆప్: హర్భజన్ కీలక ఆరోపణలు



ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి రాజ్యసభకు ఎంపికైన మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఇటీవల మరికొందరు ఆప్ ఎంపీలతో కలిసి భాజపాలో చేరారు. అయితే ఆయన కాషాయ కండువా కప్పుకోవడంపై పలువురు నెటిజన్లు విమర్శలు చేశారు. వాటిపై భజ్జీ తీవ్రంగా స్పందించారు. ఆప్ పార్టీ (AAP) రాజ్యసభ సీటును అమ్మేసిందని ఆరోపించారు. ఆ విషయాలన్నీ బయటపెట్టమంటారా అంటూ వ్యాఖ్యానించారు. 'ఆప్ నుంచి వచ్చిన రాజ్యసభ సీటుకు ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు. మీ మనస్సాక్షికి ఎంత వెలకట్టి భాజపాలో చేరారు' అని ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు హర్భజన్ బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమయం వచ్చినప్పుడు అందరి ప్రశ్నలకు తగిన జవాబు చెబుతాను. నేను ఎన్నడూ ఏ నేత గురించి తప్పుగా మాట్లాడలేదు. విమర్శలు చేయలేదు. నన్ను ద్రోహి అనే ముందు మీ పార్టీ నేతలు రాజ్యసభ సీటును ఎంత రేటుకు అమ్ముకున్నారో అడగండి. వారు మీకు చెప్పకపోతే ఎవరికి ఎంత కానుక అందిందో.. ఎవరి వైపు నుంచి అందిందో నేను చెబుతాను. పంజాబ్‌ను దోచుకోవడానికి మంత్రులు, అధికారులు ప్రజలను ఎలా మోసం చేశారో కూడా చెబుతాను. వారు పంజాబ్‌ను పూర్తిగా దోచుకొని నాశనం చేశారు. మీ నాయకుడికి (కేజ్రీవాల్‌ను ఉద్దేశిస్తూ) రాష్ట్రంపై 1 శాతమైనా ప్రేమ ఉంటే బాగుండేది' అని హర్భజన్ పేర్కొన్నారు. హర్భజన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు స్పందిస్తూ.. ఆప్‌లో రాజ్యసభ సీటును అమ్మినవారి వివరాలు వెల్లడించాలని కోరారు. ఆయన ప్రకటన పంజాబ్ రాజకీయాల్లో జరుగుతున్న కుట్రలు, అవినీతిని బట్టబయలు చేసిందని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## లద్దాఖ్‌లో కూలిన ఆర్మీ హెలికాప్టర్



లద్దాఖ్‌లోని లేహ్ పర్వత ప్రాంతాల్లో ఓ ఆర్మీ హెలికాప్టర్ కుప్పకూలింది. లెఫ్టినెంట్ కర్నల్, ఇద్దరు మేజర్లు చీతా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో ఒక్కసారిగా కూలిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ ప్రమాదంలో ముగ్గురు సైనికాధికారులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటన మే 20న జరగగా తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా ప్రమాదం అనంతరం మిగిలిన ఇద్దరితో కలిసి మేజర్ జనరల్ సచిన్ మెహతా తీసుకున్న సెల్ఫీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత సైన్యం, వాయుసేనలో దశాబ్దాలుగా చీతా, చేతక్ హెలికాప్టర్లను వినియోగిస్తోంది. అయితే వీటిలో సరైన టెక్నాలజీ, సేఫ్టీ ఫీచర్లు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతో వీటిని కొత్త టెక్నాలజీ హెలికాప్టర్లతో భర్తీ చేయడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## గ్రీన్‌కార్డు కొత్త రూల్స్.. అందరికీ కాదట..!





అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సిఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ రూల్ అందరికీ కాదని తెలుస్తోంది. తాజాగా అగ్రరాజ్యం ఇందులో కొన్ని మినహాయింపులు ప్రకటించింది. ''అమెరికా జాతీయ ప్రయోజనాలు లేక ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యం అనుకునే వలసదారులకు ఈ రూల్స్ నుంచి మినహాయింపులు ఇస్తాం. గ్రీన్‌కార్డ్ ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా మా దేశానికి ప్రయోజనం ఉందని భావిస్తే.. వాటిని మేం పరిగణనలోకి తీసుకుంటాం. దాంతో వారు ప్రస్తుతం నిబంధనల ప్రకారమే కొనసాగే అవకాశం ఉంటుంది. మిగతా వారిని వారి మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం'' అని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అవి తమ దేశానికి ప్రయోజనం కలిగించే వ్యక్తుల నుంచి వచ్చిన దరఖాస్తులు అని ఎలా నిర్ణయిస్తారో మాత్రం వెల్లడించలేదు. ముందురోజు వెలువరించిన గ్రీన్‌కార్డ్ నిబంధనల ప్రకారం.. అసాధారణ పరిస్థితుల్లోనే ఇందుకు మినహాయింపు ఉంటుందని జాక్ కహ్లర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాంటి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకొనే వారి విషయంలో అధికారులు అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కొత్త రూల్స్‌తో చట్టంలోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు.

## బొగ్గు గనిలో పేలుడు.. 82కి పెరిగిన మృతులు



చైనాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. లియుషెన్యూ బొగ్గు గనిలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ ప్రమాదంలో తొలుత మృతుల సంఖ్య తక్కువేనని వార్తలు రాగా.. తాజాగా ఆ సంఖ్య 82కి చేరింది. మరో 9 మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియా ఈ వివరాలను వెల్లడించింది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగౌజ్ గ్రూప్‌నకు చెందిన లియుషెన్యూ బొగ్గు గనిలో శుక్రవారం రాత్రి 7:30 గంటలకు గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో గనిలో 247 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని.. సహాయక చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కొందరిని రక్షించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించగా.. 38 మంది గల్లంతయ్యారని శనివారం తెల్లవారుజామున అక్కడి వార్తా సంస్థ పేర్కొంది. అయితే తాజాగా మృతుల సంఖ్య పెరిగిపోయినట్లు అక్కడి మీడియా పేర్కొనడం గమనార్హం. గనిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. గనిలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఇకనైనా భారత్‌కు వచ్చేయండి: 'గ్రీన్‌కార్డు' వ్యవహారంపై శ్రీధర్ వెంబు



అమెరికాలో శాశ్వత నివాస హక్కు కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సిఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. దీనిపై తాజాగా జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్పందించారు. యూఎస్‌లో తాత్కాలిక వీసాలపై ఉంటున్న భారతీయులు ఇకనైనా స్వదేశానికి తిరిగి రావాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'అమెరికాలో వీసాలపై ఉన్న భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. దయచేసి స్వదేశానికి తిరిగి రండి. వెనక్కి రావడం అనే నిర్ణయం మీకు కష్టంగా అనిపించినా.. ఆత్మగౌరవమే మీ మార్గాన్ని నిర్దేశించాలి' అని సూచించారు. ఈ సందర్భంగా భారత్‌కు గర్వకారణంగా నిలుద్దాం అని పిలుపునిచ్చారు. కాగా.. అమెరికాలోని భారతీయులు స్వదేశానికి తిరిగి రావాలంటూ శ్రీధర్ వెంబు కోరడం ఇదేం మొదటిసారి కాదు. భారత్‌కు మీ ప్రతిభ అవసరం అంటూ గత నెలలో కూడా ఆయన ఈ మేరకు పిలుపునిచ్చారు.



## ‘అందాల మనోహరి’ చీరకట్టులో చందమామ ‘కుషిత కల్లపు’

### సంప్రదాయ అందాలతో అభిమానుల్ని మెస్మరైజ్ చేసిన బ్యూటీ

**టాకీస్:** దక్షిణాది నటి కుషిత కల్లపు సోషల్ మీడియాలో మరోసారి తన అందాలతో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. నిత్యం తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను అభిమానులతో పంచుకునే ఈ భామ.. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.

ఉదయం నిద్రలేవగానే తన పెంపుడు కుక్క ‘ఫ్రై’తో గడిపిన మధుర క్షణాలను పంచుకున్న కుషిత.. ఆ తర్వాత తాను తీసుకునే బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ వంటి ఆహారపు అలవాట్లను కూడా అభిమానులకు చూపించింది. అంతేకాకుండా హోమంలో పాల్గొన్న వీడియోను షేర్ చేస్తూ తన ఆధ్యాత్మిక కోణాన్ని కూడా పరిచయం చేసింది.

అయితే అందరి దృష్టిని ఆకర్షించినవి మాత్రం ఆమె సంప్రదాయ చీరకట్టులో దిగిన ఫోటోలే. చీరలో ముగ్ధమనోహరంగా కనిపించిన కుషితను చూసి అభిమానులు “అందాల మనోహరి”, “చీరకట్టులో చందమామ” అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

మరోవైపు మిర్రర్ సెల్ఫీలతో పాటు డాల్‌ను తలపించేలా ఇచ్చిన క్యూట్ ఫోజులు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్‌కు క్యూట్‌నెస్‌ను జోడిస్తూ కుషిత షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. మొత్తానికి అందాల డోస్‌ను మరింత పెంచుతూ కుషిత మరోసారి నెటిజన్ల హృదయాలను కొల్లగొట్టిందనే చెప్పాలి.

## ఆ వైరల్ వీడియో, ఫొటోలు నావి కావు..



- రుక్మిణి వసంత్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళ్తున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ ‘మొదటి బికినీ షూట్’ అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు.

“నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు” అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి ‘టాక్సిక్’ చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న ‘డ్రాగన్’ సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

## 200 కోట్లు రాబట్టిన కరుప్పు



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది.

కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.

## టీ20 తరహా క్రికెట్.. తెలంగాణలో టీజీ20 లీగ్




- ఎనిమిది జట్లను ఏర్పాటు చేసిన హెచ్‌సీఏ
- జూన్ 20న తొలి మ్యాచ్, జూలై 11న ఫైనల్ మ్యాచ్
- హైదరాబాద్ జట్టును రూ.7.5 కోట్లకు కొనుగోలు చేసిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్
- జూన్ 7న ఆటగాళ్ల వేలం..

**హైదరాబాద్, మే 23**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) టీజీ20 క్రికెట్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. టీ20 తరహాలో క్రికెట్ లీగ్‌కు హెచ్‌సీఏ సిద్ధమైంది. టీజీ20 క్రికెట్ లీగ్ కోసం ఎనిమిది జట్లను ఏర్పాటు చేశారు. ఈ మ్యాచ్‌ల కోసం షెడ్యూల్ కూడా విడుదలైంది. జూన్ 20వ తేదీన తొలి మ్యాచ్, జూలై 11న ఫైనల్ మ్యాచ్ ఉంటాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్ నగర్, ఖమ్మం జట్లు ఉన్నాయి.

ఆయా జట్లను వివిధ సంస్థలు సొంతం చేసుకున్నాయి. హైదరాబాద్ జట్టును రూ.7.5 కోట్లకు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, రంగారెడ్డిని రూ.7.2 కోట్లకు బూరుగు ఇన్ఫ్రా ప్రణవ, వరంగల్‌ను రూ.6.55 కోట్లకు బైన్ గ్లోబల్ రిసోర్సెస్, మెదక్‌ను రూ.6.33 కోట్లకు బృందా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, నల్గొండను రూ.5.06 కోట్లకు కిశోర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కరీంనగర్‌ను రూ.4.57 కోట్లకు ఈఐపీఎల్ గ్రూప్ (తిబరుమల్), మహబూబ్ నగర్‌ను రూ.4.5 కోట్లకు వీరభద్ర స్టీల్స్, ఖమ్మం జట్టును రూ.4.44 కోట్లకు అన్విత గ్రూప్ సొంతం చేసుకున్నాయి.

కాగా, ఈ ఫ్రాంచైజీల కోసం ఆటగాళ్ల వేలం ప్రక్రియను జూన్ 7న నిర్వహించనున్నారు.




## ఇంధన సరఫరాలో అంతరాయం లేదు: ఐఓసీ

- దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగానే కొనసాగుతోంది
- అధిక డిమాండ్‌తో కొన్ని బంకుల్లో తాత్కాలిక ఇబ్బందులు.. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లోని బంకుల్లో పెట్రోల్, డీజిలు అధిక డిమాండ్ కారణంగా స్థానికంగా ఆయా బంకుల్లో ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, ఇది తాత్కలికమేనని ఐఓసీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

“ప్రస్తుతం పంట కోతల సమయం కావడంతో డీజిల్ కు అధిక డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో ప్రైవేట్ బంకుల్లో ఇంధనం అధిక ధర పలుకు తుండటంతో వినియోగదారులు ప్రభుత్వ బంకులకు తరలివెళ్తున్నారు. అంతర్జాతీయ చమురు ధరల కారణంగా బల్క్ పెట్రోల్, డీజిల్ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 42,000 ఇంధన స్టేషన్లలో కొన్ని బంకుల్లో మాత్రమే ఈ సమస్య వచ్చింది. ఇది తాత్కలికమే. ఇంధనానికి అధిక డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిరంతరం తగిన చర్యలను తీసుకొంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వినియోగదారులు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దు” అని ఐఓసీ ఓ ప్రకటనలో పేర్కొంది.

## ఆఖరి మ్యాచ్‌లో అద్భుత విజయం

### నేడు రాజస్థాన్ ఓడితే ప్లేఆఫ్స్‌కు?

### శ్రేయాస్ అజేయ సెంచరీ

### అట్టడుగున లఖ్‌నవూ

**లఖ్‌నవూ:** ఎట్టకేలకు పంజాబ్ కింగ్స్ ఊపిరిపీల్చుకుంది. లీగ్ తొలి దశలో అందరికంటే ముందు దూసుకెళ్లిన ఈ జట్టు వరుసగా ఆరు పరాజయాలతో డీలా పడింది. ఇక ప్లేఆఫ్స్‌పై ఆశలు పెట్టుకోవాలంటే తమ ఆఖరి మ్యాచ్‌లో కచ్చితంగా గెలిచి తీరాల్సిన వేళ.. పంజాబ్ అదరగొట్టింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (51 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 101 నాటౌట్) అద్భుత సెంచరీతో తమ జట్టును రేసులో నిలిపాడు. శనివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో నెగ్గింది. దీంతో 15 పాయింట్లతో లీగ్ దశను ముగించింది. మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. ఇన్‌గ్లిస్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 72), ఆయుష్ బదోని (18 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 43), అబ్దుల్ సమద్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) రాణించారు. చాహల్, యాన్సెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 69) అర్ధసెంచరీ సాధించాడు. షమి 2 వికెట్లు తీశాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా శ్రేయాస్ నిలిచాడు.

**శతక భాగస్వామ్యంతో.:** ఛేదనలో శ్రేయాస్ అదరగొట్టాడు. అతడికి ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ చక్కటి



సహకారం అందించడంతో పంజాబ్ ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్‌ను ముగించింది. అయితే ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ ప్రియాన్ష్ (0) వికెట్‌ను కోల్పోయింది. క్రీజులో ఉన్నంత సేపు వేగం కనబర్చిన కూపర్ (18) మూడో ఓవర్‌లో వెనుదిరిగాడు. ఈ ఇద్దరినీ షమి వెనక్కిపంపాడు. ఆ తర్వాత శ్రేయ్షస-ప్రభ్ జోరుకు లఖ్‌నవూ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఆరంభం నుంచే శ్రేయాస్ ఫోర్లతో కదం తొక్కాడు. అటు ప్రభ్‌సిమ్రన్ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 65/2 స్కోరుతో నిలిచింది. పేసర్ అర్జున్ టెండూల్కర్ తన తొలి ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చినా తర్వాతి ఓవర్‌లో శ్రేయాస్ 4, ప్రభ్ 4,6తో 15 రన్స్ సమకూరాయి. 12వ ఓవర్‌లో 3 ఫోర్లతో ప్రభ్‌సిమ్రన్ 28 బంతుల్లో.. శ్రేయాస్ 33 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేశారు. 15వ ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను అర్జున్ అవుట్ చేసినా అప్పటికే పంజాబ్ గెలుపు ఖాయమైంది. ఆ తర్వాత భారీ సిక్సర్లతో విరుచుకుపడిన శ్రేయాస్ 18వ ఓవర్ చివరి బంతికి సిక్సర్ బాది లీగ్‌లో తొలి శతకం సాధించడంతో పాటు మ్యాచ్‌ను విజయంతో ముగించాడు.

## సీఎస్‌కే కొత్త కోచ్‌గా ఎంఎస్ ధోనీ?

- అశ్విన్ సంచలన పోస్ట్
- ఫ్లెమింగ్‌ను కోచ్ పదవి నుంచి మార్చాలని డిమాండ్
- వరుసగా 3 సీజన్లలో ప్లేఆఫ్స్ చేరని చెన్నై సూపర్ కింగ్స్
- పవర్ హిట్టింగ్ గేమ్ ఆడటంలో ఫ్లెమింగ్ వ్యూహాల వైఫల్యం
- అతడి స్థానంలో ధోనీని తీసుకోవచ్చని అశ్విన్ సూచన

**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తొలగిస్తే కొత్త కోచ్ కోసం ఎక్కడో వెతకాల్సిన అవసరం లేదని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీయే ఆ పదవికి అర్హుడని అశ్విన్ ‘ఎక్స్’ వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐదుసార్లు జట్టుకు ట్రోఫీలు అందించిన ధోనీ ప్రస్తుతం సీఎస్‌కే డగౌట్‌లోనే ఉన్నాడని అశ్విన్ గుర్తుచేశాడు.

### ఫ్లెమింగ్‌పై ఎందుకు విమర్శలు..?

స్టీఫెన్ ఫ్లెమింగ్ 2009 నుంచి సీఎస్‌కే కోచ్‌గా కొనసాగుతున్నాడు. అతడి హయాంలో జట్టు ఎన్నో విజయాలు సాధించింది. అయినా గత మూడు సీజన్లుగా చెన్నై కనీసం ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ప్రస్తుత ఆధునిక టీ20 క్రికెట్‌లో మిగతా జట్లు భారీ హిట్టింగ్‌పై దృష్టి పెడుతుంటే చెన్నై మాత్రం ఇంకా పాత పద్ధతులనే నమ్ముకుంటోందనే విమర్శలు వస్తున్నాయి. రాహుల్ త్రిపాఠీ, దీపక్ హుడా, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు ఈ పాత శైలి వల్ల రాణించలేకపోయారు.



### జట్టులో లోపాలు..

ప్రస్తుత సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్ కోల్పోవడం టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌ను దెబ్బతీసింది. బౌలింగ్‌లో నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ రాణిస్తున్నప్పటికీ.. ఒక సమర్థమైన బౌలింగ్ యూనిట్‌గా చెన్నై రాణించలేకపోతోంది. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ తరహాలో చెన్నై బౌలింగ్‌లో ఆ పదును కనిపించడం లేదు.

గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో నాయకత్వ లోపం స్పష్టంగా తెలిసొచ్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.